# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

ఇస్లాంల అతిపెద్ద పండుగ అయిన రంజాన్‌ను జిల్లాలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని మండలాల్లోనూ ముస్లిం సోదరులు ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక నమాజును ఆచరించారు. కుల, మత బేధాలు లేకుండా ముస్లిం సోదరులందరూ ఆలింగనాలు చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిత్రులను ఇళ్లకు ఆహ్వానించి సేమియాలను అందజేశారు. అలాగే, జిల్లాలోని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ఆయా ఈద్గాల వద్దకు చేరుకొని ముస్లిం సోదరులను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వక్తలు, మత పెద్దలు దైవ సందేశాన్ని వినిపించారు. అందరమూ కలిసుంటేనే సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం కుటుంబాలు ఆచరించే ఫిత్రా, జకార్త్ వంటి నియమాలు పేదల ఆకలిని, శ్రమను గుర్తించి ఏర్పాటుచేసినవేనని అన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు సంపాదనలో కొంతభాగాన్ని కేటాయించడం మహోన్నతమైనదని అన్నారు.

*- నమస్తే నెట్‌వర్క్, మార్చి 31*


రంజాన్ ప్రార్థనల్లో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని


జూలూరుపాడు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పాల్వంచలో..


టేకులపల్లిలో..


కరకగూడెంలో..


కిన్నెరసాని మసీదులో మౌలానా ప్రవచనాలు


ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య..


రంజాన్ ప్రత్యేక నమాజ్‌లో పాల్గొని ఆలింగనం చేసుకుంటున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్


మణుగూరులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..


అన్నపురెడ్డిపల్లిలో..


అశ్వారావుపేట మండలం కొత్తూరులో..


కొత్తగూడెం అర్బన్ : రంజాన్ ప్రత్యేక నమాజ్ దృశ్యాలు


భద్రాచలంలో..


చర్లలో..


చండ్రుగొండలో..

## సుజాతనగర్‌లో 'కోర్టు' సినిమా నటుడు



పాల్వంచ, మార్చి 31: 'కోర్టు' సినిమా నటుడు షేక్ హర్ష రోషన్ సుజాతనగర్ గ్రామాన్ని సోమవారం సందర్శించాడు. రంజాన్ సందర్భంగా గ్రామంలోని తన కుటుంబీకుడు లాల్ మహ్మద్ ఇంటికి వచ్చి వీరితో కలిసి పండుగను జరుపుకున్నాడు. ఈ నటుడు వచ్చిన సందర్భంగా ఆ గ్రామంతో అనుబంధం ఉన్న పాల్వంచ, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లోని వారి బంధువులు, కుటుంబ సభ్యులు సుజాతనగర్ వెళ్లి అతడిని కలిశారు. నమాజ్ అనంతరం తాత షేక్ మస్తాన్, నాయనమ్మ హలిమ సమాధులను వద్ద నివాళులర్పించారు.


కుటుంబ సభ్యులతో కలిసి రంజాన్ వేడుకల్లో పాల్గొన్న హీరో హర్ష రోషన్

## ఎస్పీతో కలిసి మొక్కలు నాటిన 'విశ్వామిత్ర'


మొక్కలు నాటుతున్న ఎస్పీ, చిన్నారి విశ్వామిత్ర చౌహాన్

చుంచుపల్లి, మార్చి 31: పర్యావరణ పరిరక్షణలో తనవంతు బాధ్యతగా కృషిచేసేందుకు 'వాక్ ఫర్ ట్రీస్' అనే ఆలోచనకు శ్రీకారం చుట్టిన కొత్తగూడెం బాలుడు విశ్వామిత్ర.. సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి మొక్కలు నాటాడు. ఈ బడతడు తన మూడో ఏట నుంచే రోజుకో మొక్కను నాటుతున్న విషయం విదితమే. ఆ చిన్నారి ఈ కార్యక్రమాన్ని చేపట్టి 1031వ రోజు కావడం, రంజాన్ పండుగ కూడా రావడంతో ఎస్పీతో కలిసి మొక్కలు నాటి ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. అతి చిన్న వయసు నుంచే రోజూ మొక్కలు నాటుతున్న ఈ చిన్నారి.. ప్రపంచ స్థాయి రికార్డులో పేరు నమోదు చేసుకోవడం జిల్లాకు గర్వకారణం అని అన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసులకు ఎస్పీ సత్కారం



రిటైర్డ్ ఎస్సై శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 31: పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు అధికారులను ఎస్పీ రోహిత్‌రాజు సోమవారం తన కాక్యాలయంలో సత్కరించారు. తొలుత స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఎస్సైగా పనిచేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతూ పదవీ విరమణ పొందిన సూరిశెట్టి శ్రీనివాసరావుని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం అశ్వారావుపేటలో ఎస్సైగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన రెహమాన్‌ను, అనారోగ్య సమస్యలతో వలంటీర్ రిటైర్మెంట్ పొందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వజ్జా రామయ్యను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు అధికారులు మల్లయ్యస్వామి, కురసం సత్యనారాయణ, కృష్ణారావు, నాగరాజు పాల్గొన్నారు.

## 'రైతు కుటుంబాన్ని విత్తన కంపెనీ ఆదుకోవాలి'

జూలూరుపాడు, మార్చి 31: మండలంలోని వినోభానగర్‌లో మక్కలు తిని మృతి చెందిన రైతు కుటుంబాన్ని విత్తన కంపెనీ ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్ర నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక రైతు సంఘం నాయకులతో కలిసి రైతు సోమవారం సదరు రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను మోసం చేస్తున్న విత్తన కంపెనీలపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరారు. రైతు సంఘం నాయకులు యాస రోశయ్య, యల్లంకి మధు, రాజేశ్వరరావు, వీరయ్య, పుల్లారావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## 'హెచ్‌సీయూ భూముల వేలాన్ని విరమించుకోవాలి'

జూలూరుపాడు, మార్చి 31: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వేలాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో జేసీబీలను అడ్డుకున్న విద్యార్థి సంఘాలు నాయకులను పోలీసులు అరెస్టు చేయడం, విచక్షణ రహితంగా దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పాల్వంచలో భారీ చోరీ

పాల్వంచ, మార్చి 31: పాల్వంచ బొల్లోరిగూడెం హైస్కూల్ రోడ్డులో ఉన్న శ్రీ వేంకటేశ్వర ప్రింటింగ్ ప్రెస్ యజమాని కొత్తూరు రవితేజ ఇంట్లో దొంగలుపడి రూ.లక్ష నగదుతోపాటు 20 తులాల బంగారం చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... అనారోగ్యం కారణంగా రవితేజ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. అప్పటికే తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా నగలు, నగదు చోరీకి గురైనట్లు స్పష్టమైంది. వెంటనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుమన్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జన జాతరతో స్తంభించిన ట్రాఫిక్


వినాయకపురం జాతరలో స్తంభించిన ట్రాఫిక్

అశ్వారావుపేట రూరల్/అశ్వారావుపేట టౌన్, మార్చి 31: మండలంలోని వినాయకపురం గ్రామంలో ఆదివారం చిలకలగండి ముత్యాలమ్మ జాతరకు జనం పోటెత్తారు. అశ్వారావుపేట–భద్రాచలం ప్రధాన రహదారిలో ఈ దేవాలయం ఉంది. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆదివారం రాత్రి 9.00 గంటల నుంచి ఉట్లపల్లి నుంచి వినాయకపురం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ స్థంభించింది. దీనిని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు నానా తంటాలు పడ్డారు. చివరికి, అర్ధరాత్ర వేళ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించగలిగారు. భారీ వాహనాలను సోమవారం సాయంత్రం ఉట్లపల్లి, వేదాంతపురం, వాగొడ్డగూడెం, రామన్నగూడెం, పండువారిగూడెం, మల్లాయిగూడెం మీదుగా వినాయకపురం కాలనీ వద్ద బైపాస్ రోడ్డుకు మళ్లించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వాపురం, మార్చి 31: మండలంలోని చింతిర్యాల గోదావరి ఇసుక ర్యాంప్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసును ఎస్సై రవూఫ్ దర్యాప్తు చేస్తున్నారు.

## కానిస్టేబుల్ నుంచి గ్రూప్ -1 వరకు..

దమ్మపేట రూరల్, మార్చ్ 31: దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఏడాది క్రితం వరకు కానిస్టేబుల్‌గా పనిచేసిన మంచాల సుజాత.. ఉగాది రోజున విడుదలైన గ్రూప్ –1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంక్, ఎస్సీ కోటాలో 11వ ర్యాంక్ సాధించారు. ఆమె హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. ఆమె స్వస్థలం.. కల్లూరు మండలం పేరువంచ గ్రామం.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# నర్సుల సేవలు మరువలేనివి

- నాణ్యమైన నర్సింగ్ విద్యను అందించడమే లక్ష్యం
- నర్సింగ్ కాలేజీని ప్రారంభించిన సింగరేణి సీఎండీ బలరాం


నర్సింగ్ కాలేజీని ప్రారంభిస్తున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, మార్చి 31 : ఆస్పత్రిలో చేరిన ప్రతి పేషెంట్‌కు డిశ్చార్చి అయ్యే వరకు అంకితభావంతో సేవలు అందించే నర్సుల సేవలు ఎంతో గొప్పవని, వారి సేవలు ఎప్పటికీ మరువలేనివని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం అన్నారు. కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో అత్యాధునికంగా నూతనంగా రూ.3.46 కోట్ల వ్యయంతో నిర్మించిన సింగరేణి నర్సింగ్ కాలేజీ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1960 నుంచి సింగరేణిలో నర్సింగ్ కళాశాలను నిర్వహిస్తున్నామని, ఇక్కడి కళాశాలలో విద్య పూర్తి చేసుకున్న 825 మంది విద్యార్థుల్లో 500 మంది సింగరేణి సంస్థలో, 200 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో, 153 మంది విదేశాల్లో, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతానికి 54 మంది కళాశాలలో చదువుతున్నారని, 21 మంది పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కళాశాలలో జీఎన్ఎం నర్సింగ్ కోర్సుతోపాటు బీఎస్సీ నర్సింగ్ కోర్సు కూడా ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నామని, సింగరేణి ఉద్యోగుల పిల్లలతోపాటు ఇతర ఏరియాల పిల్లలకు కూడా నాణ్యమైన నర్సింగ్ విద్యను అందించడమే సంస్థ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్(పీపీ), పా కే.వెంకటేశ్వర్లు, డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ ఎస్‌వీ రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం నుంచి త్యాగరాజన్, కార్పొరేట్ సీఎంవోఏఐ వైస్ ప్రెసిడెంట్ వెంకటాచారి, సీఎంవో సుజాత, జీఎంలు కవితానాయుడు, సూర్యనారాయణ, దామోదర్‌రావు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నర్సింగ్ కాలేజీ సూపరింటెండెంట్ మేట్రన్ మిస్ శాలి తదితరులు పాల్గొన్నారు.

# 'యువ వికాసం'తో నిరుద్యోగం తగ్గుతుంది

- అర్హులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి
- అధికారుల వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్తగూడెం నుంచి మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పథకం అమలు ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతుందని అన్నారు. అందుకని వీలైనంత ఎక్కువమంది అర్హులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'రాజీవ్ యువ వికాసం' పథకంపై హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు, అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అర్హులందరూ ఏప్రిల్ 14లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కొత్తగూడెం నుంచి భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ.. ఎక్కువమంది దరఖాస్తులు చేసుకునే విధంగా, యువతను ప్రోత్సహించే విధంగా అధికారులను ఆదేశించామని అన్నారు. ఎంపీడీవో కార్యాలయాల నుంచి అందిన దరఖాస్తులను ఐడీవోసీ హెల్ప్‌డెస్కులో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధికారులు ఇందిరా, సంజీవరావు, ఉపేందర్, అనసూయ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 70 కుటుంబాలున్నా..సరైన రోడ్డు లేకపాయె..


మట్టి రోడ్డు దృశ్యం

లక్ష్మీదేవిపల్లి, మార్చి 31: లక్ష్మీదేవిపల్లి మండలంలోని కొత్తూరు గిరిజన గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. దీతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తూరు గ్రామంలో సుమారు 70 కుటుంబాల వారు నివసిస్తున్నారు. ప్రస్తుతం రేగళ్ల ప్రధాన రహదారి నుంచి కొత్తూరు ఊరు వరకు సుమారు కిలోమీటరు మేర సరైన రోడ్డు మార్గం లేదు. మట్టి రోడ్డు ఉన్నప్పటికీ అదంతా కంకర తేలి ఉంటుంది. అక్కడక్కడా పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డుపై నడిచేందుకు కూడా వీలుండదు. రోడ్డు పక్కన నడిస్తే జారడం, మధ్యలో నడిస్తే మోకాలి లోతు బురదలో కూరుకపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి.

## సంక్షిప్తం

### పోస్టర్ ఆవిష్కరణ

టేకులపల్లి, మార్చి 31: ఆపరేషన్ కగార్ నిలిపివేయాలన్న డిమాండుతో ఏప్రిల్ 8న హైదరాబాద్‌లో సీపీఐ–ఎంఎల్ (న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో ధర్నా జరగనుంది. ఈ కార్యక్రమ ప్రచార పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు సోమవారం టేకులపల్లిలో ఆవిష్కరించారు. కల్తీ వెంకటేశ్వర్లు, హర్జ్యా, నోముల భానుచందర్, భూక్య నర్సింగ్, ఎట్టి నరసింహారావు, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

ములకలపల్లి, మార్చి 31: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు సోదరుడు రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం దశదిన కర్మకు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తదితరులు హాజరయ్యారు. అపపారావును పరామర్శించారు.

### అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ములకలపల్లి, మార్చి 31: మండలంలోని పాత జిన్నెలగూడెం, రాజుపేట గ్రామాల్లో రెండు చెక్ డ్యామ్‌లకు, ములకలపల్లిలోని వైఎస్సార్ నగర్‌లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఇరిగేషన్ ఈఈ సురేష్‌కుమార్, డీఈ మోతీలాల్ పాల్గొన్నారు.

### మంచినీటి సరఫరాకు చర్యలు

మణుగూరు టౌన్, మార్చి 31: పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చిన్నరావిగూడెం మంచినీటి సరఫరా ఇంటెక్ వెల్‌కు నీటిని అందించేందుకు పర్ణశాల గోదావరి పాయ నుంచి కెనాల్ వర్క్ చేయిస్తున్నారు.

### సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మణుగూరు టౌన్, మార్చి 31: మణుగూరు రాజుపేట గ్రామంలో బొగ్గు టిప్పర్లు, ఇసుక లారీల రాకపోకల కారణంగా అక్కడి గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీటిని పరిష్కరించాలని కోరుతూ వారు సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు.

### పారదర్శకంగా 'యువ వికాసం'

మణుగూరు టౌన్, మార్చి 31: రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని ఎంపీడీవో తేళ్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. సందేహాల నివృత్తికి, మరింత సమాచారానికి మండల పరిషత్ కార్యాలయంలోగానీ, అధికారిక హెల్ప్ డెస్కునుగానీ సంప్రదించవచ్చని సూచించారు.

### హెచ్‌సీయూ భూములను వేలం వేయొద్దు

ఇల్లెందు, మార్చి 31: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూములను వేలం వేయొద్దని పీడీఎస్‌యూ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన సోమవారం స్థానిక చంద్ర కృష్ణమూర్తి ట్రస్ట్ భవన్‌లో పీడీఎస్‌యూ సమావేశంలో మాట్లాడారు. ఆందోళనకు దిగిన హెచ్‌సీయూ విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండించారు. నాయకులు బి.సాయి, పార్థసారథి, గంగాధర గణేష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.